విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

శనివారం 15 మార్చి 2025 8 పేజీలు

'విశాఖ ఉక్కు'ను కాపాడుకుందాం

వామపక్ష, కార్మిక సంఘ నాయకుల పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : విశాఖ ఉక్కు ప్రయివేటు పరం కాకుండా కాపాడాలంటూ ఒంగోలు ఆర్టీసీ డిపో సెంటర్లో వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి పావులు కదుపుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 15 వేల కోట్లు కేటాయించి సదరు డబ్బును ఫ్యాక్టరీ అవసరాలకు ఉపయోగించుకోకుండా అప్పులు తీర్చడానికి మాత్రమే వాడుకోవాలని ఆంక్షలు పెట్టడం దుర్మార్గమన్నారు. అప్పులు తీర్చిన తరువాత కార్పొరేట్ వారికి కారు చౌకగా అమ్మే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మిగతా 2 లో ...

ఎక్సైజ్ వసూల్

- మద్యం షాపుల నిర్వాహకుల నుంచి నెలవారీగా..
- ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.10వేల నుంచి రూ.20 వేలు
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఎక్సైజ్ అధికారులు వసూళ్ల పర్వానికి తెరతీశారు. 'అడిగినంత ఇవ్వండి.. అమ్ముకోండి..' అంటూ మద్యం దుకాణాల లైసెన్స్ దారులకు ఆఫర్ ఇస్తున్నారు. నియోజకవర్గంలో ఒక్కో షాపునకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ నెలవారీ మామూళ్లు నిర్ణయించారు. అధికార పార్టీ మద్దతు ఉన్న షాపుల యజమానులతో బేరసారాలు సాగిస్తున్నారు. దీన్ని అవకాశంగా చేసుకొని దుకాణాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్నారు. అనేక చోట్ల అర్ధరాత్రి కూడా గ్లాసులు గలగలలాడుతున్నాయి. మద్యం దుకాణం వద్దే సిట్టింగ్లు, చీర్స్ కొనసాగుతున్నాయి. బడ్డీకొట్లు కూడా బెల్ట్ షాపులుగా మారిపోయాయి. మామూళ్ల మత్తులో ఉన్న ఎక్సైజ్ అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. వ్యాపారుల అక్రమాలను అడ్డుకోవాల్సిన వారే గొడుగుపడుతున్నారు. దుకాణాలను దక్కించుకునేందుకు ఇప్పటికే తడిసిమోపెడైన ఫీజులతో అల్లాడిపోతున్న లైసెన్స్ దారులు అదనపు భారం మోయలేకపోతున్నారు. అధికారుల పరోక్ష సహకారంతో అక్రమవిక్రయాలకు తెరతీశారు. ఎక్సైజ్ శాఖను గత వైసీపీ ప్రభుత్వం రెండు ముక్కలు చేసింది. ఎన్ఫోర్స్మెంట్ కోసం ఎస్ఈబీ, పాలనాపరమైన వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ను విభజించింది. ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఆ విధానం అభాసుపాలైంది. అవినీతి రాజ్యమేలింది. ఎస్ఈబీపై లెక్కకు మిక్కిలి ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ శాఖలోనూ కొందరు దండిగా సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం మిగతా 2 లో ...

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు
- కలెక్టరేట్ ఆవరణంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : మానవతావాది, ప్రపంచ మేధావి డా.బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలు ప్రకాశం భవనం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డా. బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు, ఎస్.ఎన్ పాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, బిఎన్ విజయ కుమార్, ఒంగోలు నగర పాలక సంస్థ చైర్ పర్సన్ శ్రీమతి గంగాడ సుజాతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, మానవతావాది ప్రపంచ మేధావి డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మిగతా 2 లో ...

దళిత ఎమ్మెల్యేకు తీవ్ర అవమానం

తన పేరులేని శిలాఫలకం ఆవిష్కరణ

7 లో..

బంగారు బాపట్ల చేయటమే లక్ష్యం

2లో

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

- ప్రతి మహిళ యాప్ నిక్షిప్తం చేసుకోవాలి
- ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సహాయం
- ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే చాలు
- నిర్ణీత సమయంలో పోలీసుల రాక
- జిల్లా ఎస్పీ తుషార్ డూడి వెల్లడి

6లో

బంగారు బాపట్ల చేయటమే లక్ష్యం

- టూరిస్టు హబ్‌గా సూర్యలంకను అభివృద్ధి చేస్తా
- ప్రాంతాల అనుసంధానం జరిగేలా రోడ్లు నిర్మాణం
- తాగునీటి సమస్య పరిష్కారం కోసం ట్యాంక్ ఏర్పాటు
- ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకోండి
- ఈ నెల 24 నుంచి ప్రజల వద్దకు మీ ఎమ్మెల్యే
- మీడియాతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజకవర్గాన్ని బంగారు బాపట్లగా సుందరంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో బాపట్ల నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టికి పలు ప్రతిపాదనలు తీసుకువెళ్లానన్నారు. బాపట్ల పట్టణంలో ప్రధానంగా తాగునీటి సమస్య వల్ల ప్రజలు ఇబ్బందుల పడుతున్నారని సమస్య పరిష్కారం కోసం మరో తాగునీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. అదేవిధంగా ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంకను టూరిస్టు హబ్‌గా ఏర్పాటు కానుందన్నారు. సూర్యలంక బోట్ టూరిజానికి అనువైన ప్రాంతంగా ఉందని 18 కిలోమీటర్ల మేర సూర్యలంక-బాపట్ల మార్గంలో పేరలి డ్రెయిన్ ద్వారా నిజాంపట్నం వరకు బోటు షికారు,ఫ్యామిలీ బోటింగ్,పార్టీ బోటింగ్, కేరళ బోటింగ్ పర్యాటకులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పర్యాటక కేంద్రమైన సూర్యలంక బీచ్‌ని అభివృద్ధి చేయటం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందన్నారు. అదేవిధంగా చీరాల ఓడరేవు దగ్గరనుండి అటు రాజదండు రోడ్డు సముద్రానికి 500 మీటర్ల దూరం సమాంతరంగా బ్రిటిష్ వాళ్ళు వదిలిపెట్టిన రోడ్డు వచ్చి బాపట్ల సూర్యలంక రోడ్డులో కలుస్తోంది. రోడ్డు విస్తరణ పనులు చేసి నిర్మాణం జరిగితే పర్యాటక రంగం మరింతగా ఊపందుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి వారంలో ఒక రోజు వార్డులో ఒక రోజు గ్రామంలో పర్యటించేందుకు ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకు మీ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సోలార్ పవర్ సిస్టం ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సిస్టం ద్వారా ఎస్సీ,ఎస్టీలకు రాయితీపై విద్యుత్ అందజేయడం జరుగుతుందన్నారు. ఓసి,బిసి ఇతరులకు సోలార్ యూనిట్లపై ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఈ విధానంతో రానున్న రోజుల్లో విద్యుత్‌కు ఏమాత్రం సమస్య ఉండబోదన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్‌పై భారాలను మోపిన గత వైసిపి ప్రభుత్వం నేడు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచేస్తుందని ధర్నాలు ప్రదర్శనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల శివ,కర్లపాలెం పార్టీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు,పార్టీ నాయకులు మాజీ ఎంపిటీసీ బాజీ పాల్గొన్నారు.

ఒంగోలుకు రెండో బైపాస్ కావాలి

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు పట్టణం కు పడమర వైపు రెండవ బైపాస్ కావాలని ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి ఒంగోలు పట్టణం నుండి టి. నాయుడుపాలెం (వయా మైనంపాడు, యెండ్లూరు, కందులూరు గ్రామాల మీదుగా) వెల్లంపల్లి వరకు రెండవ బైపాస్ అవసరమని కోరారు. ఈ నేపధ్యంలో విజయవాడ లోని మాగుంట కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ని కలిసి రెండవ బైపాస్ గురించి మరియు సింగరాయకొండ దగ్గరున్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ గురించి ఒంగోలు నేషనల్ హైవే పిడి విద్యా సాగర్ మరియు ఆర్ అండ్ బి ఈఈ గోపి నాయక్ లను కలిసి చర్చించారు.

వరుడుని ఆశీర్వదించిన కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సిఎస్ పురం మండలంలోని రేగులచెలక గ్రామానికి చెందిన పాడె పెంచలయ్య కుమారుడు హరినారాయణ వివాహ వేడుక గురువారం రాత్రి జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని నూతన వరుడు హరినారాయణిని ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎక్సైజ్..వసూల్!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడిన తరువాత ఎక్సైజ్ ను ఏకతాటిపైకి తీసుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వం రాకముందు ఉన్నట్లే మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది.

మా సంగతేంటి అంటూ బేరాలు :

కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ నూతన విధానంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించింది. 20 శాతం కమీషన్ వస్తుందని చెప్పడంతో అనేక మంది కొత్తవారు సైతం మద్యం వ్యాపారం వైపు మొగ్గు చూపారు. సాంకేతిక కారణాల వలన కమీషన్ 10 శాతం మాత్రమే రావడంతో గగ్గోలు పెట్టారు. విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పరిస్థితిని సమీక్షించి క్వార్టర్ బాటిల్పై రూ.10 పెంచి వ్యాపారులకు 14.5 శాతం కమీషన్ వచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అధికారులు వ్యాపారుల మీద వాలిపోయారు. 'మీకు బాగానే లాభాలు వస్తున్నాయి. నిత్యం రూ.రెండు లక్షలకుపైగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. మా సంగతేంటి?' అని వ్యాపారుల వెంటపడటం ప్రారంభించారు. 'అడిగినంత చెల్లిస్తే మీరు ఏం చేసుకున్నా పట్టించుకోం.. లేకపోతే కేసులు పెడతాం' అని ఎక్సైజ్ అధికారులు కొందరు వ్యాపారులను బెదిరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

పల్లె గొంతుకు 'బెల్ట్' : ఎక్సైజ్ అధికారులు నెలవారీ మామూళ్లు డిమాండ్ చేస్తుండటంతో వ్యాపారులు అక్రమ విక్రయాలు చేస్తున్నారు. మరోవైపు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. దాదాపు ప్రతి గ్రామంలో ఒకట్రెండు బెల్ట్ షాపులను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలో ఒక్కో షాపు యజమాని ఆ పరిధిలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. క్వార్టర్ బాటిలు ఎమ్మార్పీకంటే రూ.20 అదనంగా తీసుకొని గ్రామాలకు చేరుస్తున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు దాన్ని రూ.20 నుంచి రూ.50వరకూ అదనంగా అమ్ముకొంటున్నారు. ఒక్కో గొలుసు దుకాణానికి ఐదు వేల వరకూ ఎక్సైజ్ అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాల వద్ద ఎలాంటి సిట్టింగ్లు ఏర్పాటు చేయకూడదు. అయితే అన్ని షాపుల వద్ద పర్మినెంట్ రూంలను తలపించే విధంగా సిట్టింగ్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకుండా మామూళ్లు పుచ్చుకొని మిన్నకుంటున్నారు.

'విశాఖ ఉక్కు'ను కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు ఎన్నికల సమయంలో ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షిస్తామని ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కేవలం సెంటిమెంటులతో పని జరగదని నష్టాలు భరించలేని స్థాయిలో ఉంటే కష్టమని చెప్పడాన్ని తప్పుపట్టారు. సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.కె.మాబు మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీని సాధించడానికి ఈ రాష్ట్ర ప్రజానీకం అనేక త్యాగాలు చేసిందని 32 మంది బలిదానాలతో అది సాధించబడిందని అంతటి చరిత్ర కలిగిన ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షించు కోవడానికి కేవలం కార్మికులు లేదా ప్రజాసంఘాలు పార్టీలు మాత్రమే ఉద్యమిస్తే చాలదని దీనిని ప్రజా ఉద్యమంగా భావించి ప్రజలంతా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఏఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎమ్. యస్. సాయి మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించనిదే బ్రతికి బట్టకట్టదని కేంద్ర ప్రభుత్వం ఎలాగైనా ప్రైవేట్ పరం చేసి తీరాలని కంకణం కట్టుకున్నదని తెలిపారు. ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర నాయకులు మోహన్ మాట్లాడుతూ దాదాపు మూడు లక్షల విలువైన ఫ్యాక్టరీని కారు చౌకగా అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నిన్దని ప్రజా పోరాటం ద్వారానే ఫ్యాక్టరీని రక్షించుకోగలమని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్రీరామ శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ నాయకులు ఆర్.వెంకట్రావు, కె.వీరారెడ్డి, ఆర్.రామకృష్ణ, యం. ఎ.సలార్, ఆర్.లక్ష్మి, టి.ప్రభాకర్, సిపిఎం నాయకులు జి రమేష్, గంటపల్లి శ్రీనివాసులు చీకటి శ్రీనివాసులు ఏ.ఐ.ఎఫ్.టి.యు లలిత కుమారి వివిధ ప్రజాసంఘాల, పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేట్‌లో ఆవిష్కరించడం ఎంతో సంతోష దాయకమన్నారు. సొంతంగా, స్వచ్ఛంగా నిబద్ధతతో మహనీయులు డా. బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత సంఘం జిల్లా కమిటీ ఏర్పాటుచేయడం అభినందనీయం అని, వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంత్రి తెలిపారు. రాజ్యాంగం ప్రకారం మన హక్కులకు స్ఫూర్తి కలిగించేలా కలెక్టరేట్ లో డా. బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ రోజు ఎన్నో అవకాశాలు ఆ మహనీయుడి వలన కలిగినప్ప టికినీ, వారు ఆశించిన స్థాయిలో మనం ముందుకు పోలేకపోయామన్నారు. ఏ సదుపాయాలు లేని రోజుల్లో వారు విదేశీ విద్యను అభ్యసించి విదేశాల్లో మన్ననలు పొందడం వారి యొక్క బహుముఖ ప్రతిభకు నిదర్శనం అని మంత్రి అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరికం లేని సమాజానికి కృషి చేస్తున్నారన్నారు. డా బి ఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి సంక్షేమ వసతి గృహాలలో, గురుకుల పాఠశాలల్లో డా. బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటుచేయడంతో పాటు వచ్చే విద్యా సంవత్సరం నుండి వారి జీవిత చరిత్ర విద్యార్థులకు తెలిసేలా పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నేడు రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలలో, గురుకుల పాఠశాలల్లో సంస్కరణలతో పాటు వసతులకు పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా సన్న బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఎస్.సి., ఎస్.టి అట్రాసిటి కేసుల బాధితులకు దీర్ఘకాలికంగా పెండింగ్లో వున్నటు వంటి నిధులను 40 కోట్ల రూపాయలను విడుదల చేయడం జరిగిందిని, ఇంకా 20 కోట్ల రూపాయలు బకాయలు ఉన్నాయని, మే నాటికి పూర్తిగా నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదని మంత్రి తెలిపారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు మాట్లాడుతూ, ఒంగోలు కలెక్టరేట్‌లో మహనీయులు డా. బి. ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాల సంతోషం, విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘాలకు అభినంద నీయమన్నారు. ఈ రోజు రాజ్యాంగం అమలు జరుగుచున్నదంటే ఆ రోజు డా. బి. ఆర్ అంబేడ్కర్ ముందు చూపుతో వ్రాసిన రాజ్యాంగం వల్లనే అని అన్నారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు రావాలన్న ఉద్దేశ్యం, లక్ష్యంతో డా. బి. ఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేసారని, వారి స్ఫూర్తితో నేడు రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. లిడ్ క్యాప్ చైర్మన్ మాణిక్య రావు, మాట్లాడుతూ, డా.బి.ఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యోగులు, సంఘాలు ముందుకు వెళ్లాలన్నారు.

ఈ కార్యక్రమంలో జరుగుమల్లి ఎంఇఓ బత్తుల నాగేంద్రవదన్, పల్నాడు జిల్లా డిఆర్ఓ మురళి, డిడి సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, ఎస్.సి కార్పోరేషన్ ఈ డి అర్జున్ నాయక్, ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి, ఎపి ఎన్జీఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కూచిపూడి శరత్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యకులు, ఈదర విజయ భాను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ బి. సునీల్ కుమార్,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు జూపల్లి రాజు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

కందులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని నాగరాజు కుంట గ్రామంలో గల రైతు సేవా కేంద్రం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ మార్కెఫెడ్ నాఫెడ్ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలైన కందులు, పప్పు సెనగ మినుము ధాన్యాన్ని, ఈ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునేందుకు ప్రభుత్వము మండలంలోని నాగరాజు కుంట చిన్నారి కట్ల సొసైటీలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ మద్దతు ధర కందులు 7550 లకు కొనుగోలు చేయడం జరుగుతుందని ,రైతులు ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ పంటలను అమ్ము కోవాలని కోరారు. మార్కెఫెడ్ జిల్లా అధికారి హరికృష్ణ మాట్లాడుతూ పంటలనుసీఎం యాప్ లో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఈ కొనుగోలు కేంద్రాల్లో నేరుగా అమ్ముకోవచ్చుని అమ్మిన నాలుగైదు రోజుల్లో రైతు బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం బాబురావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి నాగరాజు కుంటసర్పంచ్ కామసాని వెంకటసుబ్బారెడ్డి, రేగడపల్లి ,చిన్నారి కట్ల సొసైటీల అధ్యక్షులు కనకము నరసింహారావు, సాని కొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి ,టిడిపి నాయకులు తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పెరికేసుకుదేవ్, మువ్వా కాటమరాజు కిలారి బంతయ్య వల్లూరు బ్రహ్మయ్య వేంపాటి శ్రీకాంత్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, దర్శి ఏడిఏ బాలాజీ నాయక్ ,మండల వ్యవసాయ అధికారి కే ప్రసన్న రంగ లక్ష్మి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

డాగ్ స్క్వాడ్ తనిఖీలు, దుండగులు ధ్వంసం చేసిన హుండీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాలలో గత వారం రోజులలో పలు గ్రామాలలో వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మండల ప్రజలు భయాందోళనతో బెంబేలుతున్నారు. ఇటీవల కాలంలో మారెళ్ళ, ముండ్లమూరు గ్రామాలలో ద్విచక్ర వాహనం, జెసిబి తొట్టి , హోటల్లోనే దోశ పెనం, ముళ్ళమూరు గ్రామంలో బర్లీ పొగాకు , దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు బెంబేలు లేత్తుతున్నారు. ముండ్లమూరు గ్రామంలోని పోలేరమ్మ గుడి ఎదురుగా జెసిబి కి సంబంధించిన పళ్ళ తొట్టి చోరీకి గురికాగా మరుసటి రోజు బంగారయ్య హోటల్ దోసెలు వేసే పెనం, ఆ మరుసటి రోజు మారళ్ళ గ్రామంలో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయినది. గురువారం రాత్రి జమ్మల మడక గ్రామంలో ఉన్న శ్రీ దుర్గా చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో 10 సవర్ల బంగారం, కానుకల హుండీ లోని పదివేల నగదు 10 లక్షల రూపాయల విలువ గల బంగారం, వెండి, కంచు ఆభరణములు, నగదును దుండగులు ఎత్తుకొని వెళ్లి హుండీని పగుల గొట్టి, మంగళ సూత్రాలను, దోచుకుని వెళ్లారు. అలాగే బొప్పూడి వారి పాలెం గ్రామంలోని పోలేరమ్మ గుడి, ఆంజనేయ స్వామి దేవాలయంలో పదివేల రూపాయలు నగదును దోచుకు వెళ్లారు. జమ్మలమడక గ్రామ పూజారి కృష్ణ ప్రసాద్ ఉదయాన్నే గుడికి వెళ్లి చూడగా తలుపులు తీసి ఉన్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒంగోలు నుండి క్లూస్ టీం డాగ్స్ స్క్వాడ్ వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి వెళ్ళాయి. ఈ కార్యక్రమంలో క్లోస్ టీం ఎస్సై శరత్, దర్శి సిఐ వై రామారావు, ముండ్లమూరు ఎస్సై వై నాగరాజు, తాళ్లూరు ఎస్సై ఎస్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిర ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్

విశాలాంధ్ర-మార్కాపురం : ఇందిర ఇంజనీరింగ్ కళాశాలకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) 'బి' గ్రేడ్ జారీచేసింది. కళాశాలలో అమలుచేసే విద్యా విధానాలు, ఫలితాలు, అధ్యాపకులు, పరిశోధనా విభాగాలు, మౌలిక సౌకర్యాలు, విద్యార్థులకు అందించే సదుపాయాలు లాంటి విభాగాల్లో నాణ్యతను పరీక్షించి, దాని ఆధారంగా గ్రేడ్లను న్యాక్ జారీ చేస్తుంది. ఫిబ్రవరి 28 నుండి నుంచి మార్చ్ 1 తేదీ వరకు ఇందిర కళాశాలలో పర్యటించిన న్యాక్ బృందం మౌలిక సదుపాయాలు,విద్యా విధానాలు, కళాశాల అవలంభిస్తున్న విధానాలపై సంతృప్తి వ్యక్తం చేసి 'బి' గ్రేడ్ ఇచ్చినట్లు కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్రలు తెలిపారు. ఈ ఘనత సాధించటానికి కృషి చేసినటువంటి కళాశాలలోని అధ్యాపక బృందానికి, అధ్యాపకేతర బృందానికి, విద్యార్థులకు అందరికి కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రాజశేఖరరెడ్డి, విభాగదీపతులు సురేంద్ర రెడ్డి, పుష్పలత, సత్యవాణి, నసీమ, గంగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకల్లో ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం మండల కేంద్రమైన దోర్నాల్లో జనసేన పార్టీ మండల కన్వీనర్ మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోర్నాల పట్టణంలోనీ స్థానిక శివసదనంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ జయకేతనం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిధులుగా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి జన సైనికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ. జగన్ అక్రమంగా చంద్రబాబుని జైలులో వేసినప్పుడు, జనసేన అధినేత చంద్రబాబుని జైల్లో పరామర్శించిన వెంటనే కూటమితో కలిసి పనిచేస్తామని, జగన్ గద్దె దింపుతామని ధైర్యంగా ఆనాడు ముందుకొచ్చారని, అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి డిప్యూటీ సీఎం గా ఉన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జనసేన కార్యకర్తలకు ఎరిక్షన్ బాబు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు, మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి షేక్ మాబు, బట్టు. సుధాకర్ రెడ్డి, కోప్పుల వెంకటసుబ్బారెడ్డి, చంటి, ఈదర మల్లయ్య, యమా దాసయ్య, ఇరుకసాని దేవయ్య యాదవ్ సోమేపల్లి శేఖర్, షేక్ మంజూరు భాషపటాన్ ఖన్, టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

బెంగుళూరులో జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం బెంగుళూరులో దళందూర్‌లో జనసేన నాయకులు సమ్మన తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. జనసేన పార్టీ స్థాపించి 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. బెంగుళూరు దళందూర్‌లో సమ్మన తిరుపతి ఆధ్వర్యంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మన రమణయ్య, కాలేష్, నారాయణ, రాంబాబు, ఖాజారెడ్డి, సురేష్, నాగయ్య, రత్తయ్య, వంశి పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ చిత్రపటాన్ని బహుకరించారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ మందలపాయ శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథ స్వామి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పూలమాలలు శాలువాలు వేసి మేళతాళాలతో ఆలయం వరకు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గోడి ఓబుల్ రెడ్డి, ఎం జ్యోతీన్ దర్ రెడ్డి, అంబారపు రామకృష్ణారెడ్డి, టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని 14వ వార్డులో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని సందర్భంగా బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ ఆదేశాల మేరకు కేఆర్‌కే నాయుడు,చల్లా శ్రీనివాసరావు,కొక్కిరాల రాజేంద్ర,కంచర్లపల్లి కిషోర్ నేతృత్వంలో ఘనంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు,బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి,ఊసా మాధవి,షేక్ కరీముల్లా,గంట నాగమల్లేశ్వరరావు,బడే అంకమ్మరావు,బెజ్జం బాబురావు,సాయి తేజ,గార్నిపూడి క్రీస్తు బాబు,జనసేన నాయకులు,జన సైనికులు,వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో చెన్నారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి ఎంపీటీసీ కుమార్తె వివాహ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు మొత్తముల అశోక్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు టీడీపీ నాయకులు మేడం జ్యోతి ఇంద్రారెడ్డి పన్కో రాజగోపాల్ బొడ్డు పెద్ద రంగయ్య కటారి కృష్ణ యాదవ్ చెన్నారెడ్డి రామకృష్ణారెడ్డి మాజీ ఎంపీటీసీ. చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఎంపిటిసి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం వేగవంతం చేయాలి

పనులను పరిశీలించిన ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని అయినముక్కల గ్రామంలో 49 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న గిరిజన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను శుక్రవారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులలో జాప్యం జరగకుండా త్వరగతిన హాస్పిటల్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఈ ఆసుపత్రి పూర్తి అయితే పశ్చిమ ప్రాంత గిరిజన ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని తెలిపారు. ఈ ఆసుపత్రి తొందరగా పూర్తి అయితే ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి, షేక్. మాబు, బ ట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, లాయర్ వల్లపునేని కాశయ్య, చంటి, ఈదర మల్లయ్య, షేక్ మంజూరు భాష,, సోమేపల్లి శేఖర్, చెన్నారెడ్డి, రమణారెడ్డి, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని ప్రతి గ్రామంలో చిన్నపిల్లలు పెద్దలు శుక్రవారం ఘనంగా హోలీ పండగ నిర్వహించుకున్నారు. మండల కేంద్రములో జరిగిన హోలీ కార్యక్రమంలో ముదివర్తి వేంకటా చలపతిరావు మాట్లాడుతూ హోలీ అనేది వసంత రుతువును స్వాగతించే పండుగ. శీతా కాలపు నీలిమంటలు తొలగిపోయే రోజు, చెడుపై మంచి గెలిచిన సందర్భంగా ప్రత్యేకంగా మనము ఈ పండుగను నిర్వహించుకుంటాము. హోలీకి ఒకరోజు ముందే హోలీకా దహన్ చేస్తారు. అంటే చెడును అగ్నిలో వేసి కాల్చేస్తారు. భారతదేశంలోని ఉత్తర భారతంలో హోలీకా దహన్ చాలా పెద్దగా నిర్వహించుకుంటారు. మన వైపు హోలీ పండుగను రంగుల చల్లుకోవడం ద్వారా నిర్వహించుకుంటాం. ప్రకృతిలో ఆనందకం మైన మార్పు, ఇవన్నీ మనకు రంగుల కలయిక వలె ఉత్సాహాన్ని వ్వాలనీ, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంలో మన సమాజం యొక్క సమర్థతను పెంచుకొనేందుకు అన్ని వర్గాల ప్రజలను కలిపి ఏకీకృతం చేసే పండుగే హోలీ పండుగ. కుల, వర్గ భేధ భావాలను బాల్యం నుంచే తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందన్నారు.

పశుగ్రాసం కొరత

విశాలాంధ్ర-ముండ్లమూరు : వర్షాభావ పరిస్థితులు నెల కొనడంతో కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. పశ్చిమ ప్రకాశంలో సరిగా వర్షాలు పడక, సాగర్ జలాలు లేక పంటలు పండక, ఒకవైపు పశుగ్రాసం కొరత మరోవైపు వెరసి పాడి లేక ఇటుకాడెద్దులకు మేత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవిలో తాగేందుకు చుక్క నీరు, పశుగ్రాసం లేకపోవడంతో పశ్చిమ ప్రకాశంలోనే పుల్ల చెరువు మండలం నుండి ఆవులు మందలు పొరుగు జిల్లాకు వలస వెళుతున్నాయి. శుక్రవారం ముండ్లమూరు నుంచి సుమారు నాలుగువేల ఆవులను మేత కోసం గుంటూరు జిల్లాలోని కొన్ని మండలాలకు, బాపట్ల జిల్లాలోని కొన్ని మండలాలకు తోలుకెళుతూ విశాలాంధ్రకు కనిపించారు. దాహార్తితో ముండ్లమూరు వేంపాడు గ్రామాల మధ్య ఉన్న చిలక లేరు వాగులో నీటిని దప్పిగా తీర్చుకుంటూ ముందుకు సాగాయి.

అలంకారప్రాయంగా చెత్త సంపద కేంద్రాలు

- రూ.లక్షల ప్రజాధనం వృథా
- అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా డంపింగ్ యార్డులు
- దొంగలు ఎత్తుకెళ్లిన రేకులు
- చుట్టూ చిల్ల చెట్లతో డంపింగ్ యార్డ్

విశాలాంధ్ర-పొన్నలూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర అని చెబుతుంటే అవి కేవలం ప్రచారాలకే పరిమితై ఉన్నాయని గ్రామాల్లో ప్రజలు తెలుపుతున్నారు. మండలంలోని చెరువుకొమ్మిపాలెం దగ్గర ఉన్న డంపింగ్ యార్డ్ చుట్టూ చిల్ల చెట్లతో నిరుపయోగంగా ఉంది డంపింగ్ యార్డ్ పైన ఉన్న రేకులు దొంగలు ఎత్తుకొని వెళ్లడంతో డంపింగ్ యార్డ్ గోడలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మండలంలోని కొన్ని గ్రామాలలో డంపింగ్ యార్డులు శిధిల వ్యవస్థలో చేరుతున్నాయని గ్రామాల్లో ప్రజలు తెలియజేస్తున్నారు. వాస్తవానికి పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తడి, పొడి చెత్తను తరలించి చెత్త సంపద తయారీ కేంద్రాలలో వేరువేరుగా వాటిని ప్రాసెస్ చేసి ఎరువులు తయారు చేయాల్సి ఉంది. గ్రామాల్లోని చెత్త సంపద తీసుకునేందుకుగాను ఆటో రిక్షాలను ఉపయోగించి పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తడి పొడి చెత్త లను ఇండ్ల నుండి తీసుకొని చెత్త సంపద కేంద్రానికి తరలించేవారు కానీ అవి వినియోగించకపోవడం వలన గ్రామాలలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయటం అవి కుళ్ళి దుర్వాసన వస్తుందని ప్రజల తెలియజేస్తున్నారు. కొన్ని చోట్ల చెత్త నిలువ ఉండటం వలన దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ ,మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గ్రామాలలో ప్రజల తెలియజేస్తున్నారు. కావున సంబంధించిన అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకుని డంపింగ్ యార్డ్లు ఉపయోగంలో ఉండేటట్టు చూడాలని ప్రజలు తెలియజేస్తున్నారు.

మూగజీవుల..వలస

విశాలాంధ్ర-సీఎస్ పురం : కనిగిరి నియోజకవర్గ ప్రజలు దేశంలోనే నలుమూలన బతుకుదెరువు నిమిత్తము వలసలు ఎక్కువగా ఉంటాయి అదే విధంగా మూగజీవులు కూడా ఎండాకాలం వస్తే నాగార్జునసాగర్ కాల్వ ప్రాంతమైన దర్శి తదితర నీటి ప్రాంతానికి పశువులు గొర్రెలు మేకలు వలస వెళ్లటం జరుగుతుంది ఇంకా ఎంతకాలం ఈ గోసా అంటూ స్థానిక రైతులు వాపోతున్నారు కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్తో పాటు వర్షాలు కూడా సంవత్సరానికి 10,15 సార్లు వర్షం పడుతుంది. ఈ ప్రాంతం కరువు ప్రాంతం కనుక అనేక ఇబ్బందులకు లోని మనుషులు తాగే దానికి కూడా నీరు ఉండదు. మూగజీవులను నీటి ప్రాంతానికి తీసుకెళ్లటం అక్కడనే రుతుపవనాలు వచ్చేంతవరకు నీటి ప్రాంతానికి ఆవులను గొర్రెలను మేకలను తీసుకుని వెళ్ళటం జరుగుతుంది రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల గోడును విన్నవించుకుని తొందరగా వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని రైతులు రైతు కూలీలు పేద ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఎక్కువ శాతం ఉన్న కనిగిరి ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో గూడూరి ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండలం రామచంద్రకోట గ్రామంలో దర్శనం వారి పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు. శుక్రవారం రామచంద్ర కోట గ్రామంలో ముందుగా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకు రామచంద్ర కోట గ్రామ టిడిపి నాయకులు, దర్శనం దేవయ్య, నాయకులు ముందుగా ఎలక్షన్ బాబుకు శాలువలతో పూలమాలలతో సన్మానించారు. అనంతరం చిరంజీవిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, రాను చంద్ర కోట టీడీపీ, కూటమి నాయకులు పాల్గొని ఆశీర్వ దించారు. ఈ కార్యక్రమంలో. మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి, షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి కొప్పుల వెంకట సుబ్బారెడ్డి ఈదర మల్లయ్య, వల్లపునేని కశాయ్య మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన 'కదిరి'

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సిఎస్‌పురం గ్రామానికి చెందిన రేనాటి వెంకటేశ్వర్లు కుమారుడు సుభాష్ వివాహం ఇటీవల జరిగింది. గురువారం రాత్రి కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు వారి నివాస గృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

హోలీ..కేరింతలు

విశాలాంధ్ర-పిసిపల్లి : మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. రంగుల పండుగ కేరింతలు ఆనందోత్సవాల మధ్య శు క్రవారం ప్రజలు హోలీ పండుగను జరుపుకొన్నారు. పల్లె, పట్టణం ఏ వీధిలో చూసినా హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు, యవతీ యువకులు, పెద్దలు రంగుల్లో మునిగి తేలారు. పలుచోట్ల హోలీ సందర్భంగా కామదహనం నిర్వహించారు. చిన్నాపెద్దా కలిసి ఆడిపాడుతూ.. రంగులు పూసుకుంటూ సందడి చేశారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పెద్దారవీడు : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పెద్దారవీడులోని కుంటలో ఆ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ గారి సేవ స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నడు జరగని జనసేన పండుగ గ్రామగ్రామాన జరుగుతుందని చిన్న పాల్ తెలిపారు.

గెలిచి విజయోత్సవ సభ నిర్వహించుకుందామని చెప్పినట్టుగానే అధినేత చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాకం సందీప్, జడ్డ రాజు, ఎనిబెర జాని, కొడమల బాబు, వెంకటేశ్వర్లు, ఆవుల రాజు, వినయ్ కుమార్, శ్రీరామ్, పాపయ్య, సతీష్, నాగేష్ నాయకులు పాల్గొన్నారు.

పీఎంఏవై లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం: ఎంపీడీవో

విశాలాంధ్ర - నిజాంపట్నం : పీఎంఏవై పథకం కింద గృహ నిర్మాణాలు చేపట్టి వివిధ దశల్లో నిలిచిపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందజేస్తుందని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో పీఎంఏవై గ్రామీణ్ 1.0 పథకంలో మంజూరైన గృహాలు ఇంకా పూర్తి కాకుండా వివిధ దశల్లో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు తమ గృహాలను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ సహాయాన్ని పొందటానికి తమ గృహాలను వెంటనే నిర్మించుకోవాలని కోరారు.

నగరం మండల బీజేపీ అధ్యక్షుడిపై దాడి

విశాలాంధ్ర - రేపల్లె : భారతీయ జనతా పార్టీ రేపల్లె నియోజకవర్గం నగరం మండల అధ్యక్షులు జుజ్జువరపు సురేష్‌పై గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాడి జరిగింది. రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి గురైన సురేష్‌ను రేపల్లె పట్టణ భారతీయ జనతా పార్టీ సభ్యులు పరామర్శించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా రేపల్లె పట్టణ బీజేపీ నాయకులు తెలిపారు.

17న రాజగోపురం ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో శ్రీత్రిపుర సుందరి సమేత,త్రిపురాంతక స్వామి,శ్రీభద్రకాళి సమేత,వీరభద్ర స్వామి ఆలయంలో దాతలు రాటకొండ హనుమంతురావు రాటకొండ కోటేశ్వరరావులు రూ.25 లక్షల సొంత నిధులతో నిర్మించిన శ్రీ రాజగోపురం, పంచ విమాన శిఖరం,ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దాతలు తెలిపారు.ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నేటి నుంచి హోమాలు, కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.17వ తేదీన అన్నదానం నిర్వహిస్తున్నామని ప్రజలు పాల్గొని స్వామివారి పూజా కార్యక్రమాలను తిలకించి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

26న రేపల్లె బార్ అసోసియేషన్ ఎన్నికలు

విశాలాంధ్ర - రేపల్లె : ఈనెల 26న రేపల్లె బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ న్యాయవాది జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె న్యాయవాదుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆయన చెప్పారు.ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్,జనరల్ సెక్రెటరీ,జాయింట్ సెక్రెటరీ,లైబ్రరీ సెక్రెటరీ, కోశాధికారి మార్చి 26వ తేదీ ఉదయం 10.30 నుండి సాయంత్రం 4.30 వరకు ఎన్నికల నిర్వహిస్తామన్నారు.అనంతరం 17వ తేదీ,18న నామినేషన్ల స్వీకరణ,పరిశీలన ఉపసంహరణ ,26వ తేదీ ఎన్నికలు జరుగుతాయని అదేరోజు సాయంత్రం ఐదు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడతాయని ప్రశాంత్ కుమార్ వివరించారు.

ముగిసిన శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఉప్పుడి రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ధ్వజ దేవర్చన,ధ్వజారోహణం,కార్యక్రమం ఘనంగా అత్యంత వైభవంగా నిర్వహించారు.11వ తేదీన శేష వాహన సేవ 12వ తేదీన గరుడ వాహన సేవ 13వ తేదీన రథోత్సవం 14వ తేదీన స్వామివారికి చక్ర స్థానం,మహా పూర్ణాహుతి ద్వాదశ ప్రదక్షిణలు,పవళింపు సేవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం వందలాదిమందికి ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది.

మండుతున్న ఎండలు

- బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు
- నీడ లేక చెట్ల కిందకు పరుగులు

విశాలాంధ్ర - రేపల్లె : వేసవికాలం ఆరంభంలోనే ఎండలు ఠారెక్కిస్తున్నాయి. పట్టణంలోని పలు బస్‌స్టాప్‌లలో బస్ షెల్టర్లు లేకపోవడం వలన ఎండదెబ్బకు ప్రయాణికులు మలమలా మాడిపోతున్నారు. దీంతో దాహార్తి తీర్చుకునేందుకు పుచ్చకాయలు,కొబ్బరినీళ్లు,మజ్జిగ తదితర చలువచేసే వాటిపై ప్రయాణికుల ముగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు అంకమ్మ చెట్టు సెంటర్ వద్ద బస్ షెల్టర్ ఉండేది. రోడ్డు విస్తరణ కార్యక్రమంలో బస్సు షెల్టర్‌ను తొలగించారు. నూతన సీసీరోడ్డు నిర్మించిన తర్వాత పాత బస్‌షెల్టర్‌కు అభిముఖంగా నూతన బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తారని ప్రయాణికులు ఆశించారు. కానీ అధికారులు,పురపాలకులు కుంటిసాకులు చెబుతూ ప్రయాణికులకు షెల్టర్ లేకుండా చేశారు. ఇటీవల మున్సిపల్ అధికారులు రోడ్డు వెంబడి ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఆ రోడ్డు వెంబడి ప్రభుత్వ ప్రైవేటు ఎన్జీవో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఆయా బస్ స్టాప్‌లో రోడ్డుకు ఇరువైపులా షెల్టర్‌నూ,బస్ బేలను నిర్మించిన,ప్రయాణికులు రోడ్డుపైనే బస్సులను ఆపి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సురక్షితంగా బస్సులను ఎక్కవచ్చు. నిత్యం పట్టణంలో వాహనాలను కూడలిలో,రోడ్డుపైనే ఆపడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి విపరీతమైన వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ముఖ్యంగా పట్టణంలో ఇసుకపల్లిలోని బేతపూడి క్రాస్‌రోడ్ సెంటర్, ఓల్డ్‌టౌన్‌లో పెద్ద కూరగాయల మార్కెట్,అంకమ్మ చెట్టు వద్ద నిత్యం వేలాదిమంది వ్యాపారస్తులు,విద్యార్థులు,దిగువ గ్రామీణ ప్రజలు,ప్రయాణికులు గమ్యస్థానం చేరుకోవడానికి బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. ఇదే అదనంగా ఆటోలు,కొన్ని ప్రైవేటు వెహికల్స్ ప్రయాణికులను చేరవేస్తూ ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నాయి,ప్రయాణికులు బస్సుల కొరకు ఆయా స్టాపుల్లో ఎదురు చూసేటప్పుడు షెల్టర్ ఏర్పాటు చేయడం వలన ఆర్టీసీకి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అంకమ్మ చెట్టు సెంటర్,పెద్ద జామియా మసీదు-ప్రధాన పోస్ట్ ఆఫీస్ వెనకవైపు,పెద్ద కూరగాయల మార్కెట్,రింగ్ రోడ్ సెంటర్,ఇసుకపల్లిలోని బేతపూడి క్రాస్ రోడ్ వద్ద నిత్యం విద్యార్థులు, వృద్ధులు,వ్యాపారస్తులు,చంటి పిల్లలతో తల్లులు వందలాదిమంది ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. షెల్టర్లు ఏర్పాటు చేయడానికి వివిధ ప్రభుత్వ ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానించి తక్కువ ఖర్చుతో పట్టణానికి శోభను తెచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవచ్చునని,అసాంఘిక కార్యక్రమాలు లేక దుర్వినియోగం కాకుండా తగు రక్షణ ఏర్పాట్లు చేసి ప్రయాణికులు పడుతున్న పాట్లును, ప్రజల అవస్థలను పురపాలకులు,అధికారులు అర్థం చేసుకుని ఆయా ప్రాంతాలలో సత్వరమే బస్సు షెల్టర్‌లను, ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సింగరకొండ తిరునాళ్ల

విశాలాంధ్ర - అద్దంకి : సింగరకొండ లక్ష్మీనరసింహస్వామి,ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. శుక్రవారం వేకువ జాము నుంచే స్వామి వార్ల దర్శనం ప్రారంభమైంది. ఉదయం భక్తుల రద్దీ తగ్గినప్పటికీ సాయంత్రం 4 గంటల నుంచి పెరిగింది. భక్తులు క్యూ లైనలలో బారులు తీరి స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులతో పాటు పలువురు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉచితంగా మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అన్ని సామాజికవర్గాల అన్నదాన సత్రాలతో పాటు శ్రీరామ జీవన సంఘం మఠంలో అన్నదాన కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. విద్యుత్ దీపాల వెలుగులో రెండు దేవాలయాలు కొండపై నడకదారి దేదీప్యమానంగా వెలుగొందాయి. కొండపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహుని కళ్యాణం వైభవంగా జరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఈవో కోటిరెడ్డి కొండపైకి భక్తులకు ఉచితంగా బస్సులు ఏర్పాటు చేశారు. తిరుణాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ళ ప్రత్యేక అధికారిని శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ రవణమ్మ పర్యవేక్షణలో తిరునాళ్ల ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

పిఠాపురం తరలిన బాపట్ల జన సైనికులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జనం గుండెల్లో రలిగిన ఉద్యమం జనసేన డిప్యూటీ సీఎం పవన్ ప్రస్థానం నవశకానికి నాంది పలికిందని బాపట్ల టౌన్ జనసేనా పార్టీ సీనియర్ నాయకులు కరుమూరి ఆంజనేష్ తెలిపారు. ఉవ్వెత్తున ఎగసిన ఉత్సాహంతో జన సైనికులు ఆంజనేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో పిఠాపురం వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన జనం గుండెల్లో నుంచి నిప్పు కణికలా ఉద్భవించిన పార్టీ జనసేన అని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక పార్టీ పుట్టిన రోజు మాత్రమే కాదని,ఒక ఆశయం,ఒక సంకల్పం, ఒక నూతన శకానికి నాంది పలికిన రోజు అన్నారు. యువతకు ఉపాధి కల్పించడం, రైతులకు న్యాయం చేయడం,మహిళలకు భద్రత కల్పించడం,పేదలకు విద్య,వైద్యం అందించడం కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని ఇది ఒక ఉద్యమమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి,అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్, సురేంద్ర,మదాసాని బాలాజీ,దాసరి వినోద్, తిరుమలశెట్టి సాగర్,కామిశెట్టి సాయి,పెద్ది నాగు,జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పట్టణం అంబేద్కర్ భవన్‌లో బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా పట్టణంలోని బాల సదనం, శారా ఫెయిత్ ఫౌండేషన్ విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ సలగల ఎలీషా బాబు పంపిణీ చేశారు. ఫౌండర్ ప్రెసిడెంట్ సలగల ఎలీషాబాబు మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా బెటర్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రస్ట్ ట్రెజరర్ ఏపూరి బాబూరావు ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమ వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.పురుషోత్తం మాట్లాడుతూ పిల్లలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని,ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశా రు. తదనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, అడ్వకేట్స్ మధుబాబు, శంకర్ ప్రసాద్,కిషోర్, కాగిత కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జనసేన లక్ష్యం



విశాలాంధ్ర - చీరాల : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జనసేన ఆవిర్భవించిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జనరంజక పాలన అందిస్తుందని జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పిఠాపురం చిత్రాడలో జరుగుతున్న జనసేన 12వ విజయోత్సవ సభకు చీరాల నుంచి భారీగా జనసైనికులు తరలి ఈ కార్యక్రమంలో వీర మహిళ లక్కాకుల లక్ష్మి,అనుమ కొండ కిషోర్ కోఆర్డినేషన్లో, జనసేన నాయకులు అభిమానులు తరలివెళ్లారు.

పొలిటికల్ బ్రోకర్ విజయసాయిరెడ్డి

- జగనను అడ్డుపెట్టుకొని ఆర్థికంగా ఎదిగిన వ్యక్తి
- వైసీపీలో కుల కుంపటి పెట్టిన వ్యక్తి
- విజయసాయి రెడ్డి కారణంగానే కవిత, క్రేజీ వాల్ జైలుకు
- కేంద్ర పెద్దల మన్ననకోసమే వైసీపీపై అభాండాలు
- వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవిబాబు ధ్వజం

విశాలాంధ్ర -ఒంగోలు: విజయసాయిరెడ్డి పెద్ద పొలిటికల్ బ్రోకర్ అని వైసీపీ ఒంగోలు నియోజక వర్గం ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవి బాబు మాట్లాడుతూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. జగన్‌ను అనుకూల శత్రువు విజయసాయిరెడ్డి అన్నారు. వైసీపీలో కులాల ప్రస్తావన తెచ్చింది విజయసాయిరెడ్డినే అన్నారు. విజయ్ సాయి రెడ్డి ఆరోపణలు చంద్రబాబు నాయుడుకు మేలు చేసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వ్యాపారవేత్తగా పార్టీలోకి అడుగుపెట్టి ఆర్థికంగా బాగా ఎదిగారు అన్నారు. ఉత్తరాంధ్ర బాధ్యతలు జగన్ ఇస్తే డిప్యూటీ సీఎంలా ఆయన చేసిన నిర్వాకం ఆ ప్రాంతంలో రెండింతల దెబ్బతిన్నదని అన్నారు. పార్టీ అధికారం పోగానే, ఓపిక లేక పార్టీని వీడారని అన్నారు. ఢిల్లీలో లాబీయింగ్‌కు బాగా అలవాటు పడిన వ్యక్తి అన్నారు. అతని బ్రోకర్ పనితనం వల్లనే కేసీఆర్ కుమార్తె కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి క్రేజీవాల్ జైలుకు వెళ్లారన్నారు. అల్లుడి కంపెనీలు ఆర్థికంగా ఎదిగేందుకు పార్టీని అడ్డు పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ వై.వి సుబ్బారెడ్డి, అతని కుమారుడు విక్రాంత్ రెడ్డిలను అనవసరంగా వివాదాల్లోకి లాగారన్నారు. 2019 ఎన్నికలలో వైవి సుబ్బారెడ్డి పై జగన్‌కు అబద్దాలు చెప్పి ఎంపీ సీటు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. జిల్లా రాజకీయాలలో వేలు పెట్టి, పలువురికి ఎమ్మెల్యే సీట్లు ఇవ్వటంలో కీలక పాత్ర పోషించారు అన్నారు. ఎన్నికల తర్వాత ఆయన సీట్లు ఇచ్చిన ఏ వ్యక్తి పార్టీ కోసం పనిచేయడం లేదని విమర్శించారు. వైసీపీ శ్రేణులు అన్ని గమనిస్తున్నారని, విజయసాయి రెడ్డికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి రమణారెడ్డి మాట్లాడుతూ పార్టీలో హీన రాజకీయ సంస్కృతిని తెచ్చిన వ్యక్తి విజయసాయి రెడ్డి అన్నారు. చెన్నైలో ఒక సాధారణ ఆడిటర్ గా పనిచేస్తున్న వ్యక్తిని రాజకీయాల్లోకి తెచ్చి జగన్ తర్వాత ఆ స్థాయి వ్యక్తిగా గౌరవిస్తే విజయసాయి రెడ్డి మాత్రం పార్టీకి వెన్నుపోటు పొడవడం దుర్మార్గమన్నారు. వైసిపి ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్ మాట్లాడుతూ పార్టీకి వ్యతిరేకంగా కొన్ని అదృశ్య శక్తులు విజయ సాయి రెడ్డిని నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి ప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు నగర కంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నటి ఉదయభానుకు సన్మానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రముఖ సినీ, టీవీ నటి ఉదయభానును ఇవివి యువ కళావాహిని అధ్యక్షులు వెచ్చా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి ఉదయభానును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఇవివి యువ కళావా హిని విశిష్ట మహిళ పురస్కారాన్ని ఉదయభానుకు అందజేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ పురస్కారాలే నటులకు ప్రేరణ అన్నారు. వెచ్చా కృష్ణ మూర్తి మాట్లాడుతూ ఉదయభాను నటిగా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సభ్యులు రఘు, పి.కిరణ్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేస్తా

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో రిలీఫ్ బకాయిలను చెల్లించేందుకు మే నెలాఖరుకల్లా నిధులు విడుదల చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. శుక్రవారం ఒంగోలులోని కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వచ్చిన మంత్రి స్వామిని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను నాగేంద్ర మంత్రి స్వామి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏడాదికి రెండుసార్లు జరగాల్సిన స్టేట్ లెవెల్ హైపవర్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు రాష్ట్రంలో సక్రమంగా జరగటం లేదన్నారు. చివరి స్టేట్ కమిటీ సమావేశం 2021 ఫిబ్రవరి 4న వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఒక్క సమావేశం కూడా జరగలేదన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద నమోదైన కేసుల్లో బాధితులకు రిలీఫ్ మంజూరు కావడం లేదని, 2022లో నమోదైన కేసులకు ఇంత వరకూ రిలీఫ్ ఇవ్వలేదని నాగేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరలో సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన స్టేట్ లెవెల్ హైపర్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, దళితుల సమస్యలను ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తామని స్వామి చెప్పారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేదిక మీద సైతం పేర్కొన్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మంత్రి స్వామిని కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య దళిత నాయకులు కాకుమాను రవి కసుకుర్తి ఆగమన రాజు, ఎస్టీ సంఘ నాయకులు గంటా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సమస్య పరిష్కరించటం ప్రభుత్వ బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లి : వందలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని యూనియన్ నాయ కులు కూరపాటి స్టీవెన్ తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టప రిహారం కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 101వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.వి మోహనరావు, సిహెచ్ పిచ్చయ్య, ఆర్ ఇస్రాయెల్, కె ఆదినారాయణ, ఎం గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఎం.ఆశీర్వాదం, డి.మాణిక్య రావు, బి.అంకయ్య, వై.సాల్మన్, వై.యెహోషువ, షేక్.సుభాని, వై.సుబ్బారావు, ఎండి రహీంతుల్లా, సాంబయ్య, టి.దుర్గా భవాని, వై.రమా దేవి, షేక్.ఇమాంబి, ఈ.సారమ్మ, ఎం.శివకుమారి, వి.రిబ్కా డి. మల్లేశ్వరి, ఎస్.శాంతమ్మ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం 'శక్తి'యాప్

- ఎస్పీ తుషార్ డూడి



విశాలాంధ్ర - బాపట్ల : మహిళల భద్రతకు రక్షణ కవచం లాంటిదిశక్తి యాప్ అని బాపట్ల జిల్లా ఎస్పీ డూడి తెలిపారు. శక్తి యాప్ మహిళలకు ఏవిధంగా ఉపయోగపడుతుందో, వినియోగించుకునే విధానం గురించి ఎస్పీ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, ఇతర హింసాత్మక ఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు వారి యొక్క ఫోన్‌లలో శక్తి యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. యాప్‌ను వినియోగించుకొని ఆపద సమయంలో పోలీసుల తక్షణ సహాయం, సహకారం పొందవచ్చునన్నారు. ఆపదలో ఉన్న మహిళలు యాప్ లో వున్న ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు డయల్ 112 నెంబరుకు చేరుతుందన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. బాపట్ల జిల్లాలో శక్తి బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఒక్కొక్క బృందంలో 6 గురు సభ్యులు ఉంటారన్నారు. ప్రతి బృందానికి ఒక ఎస్సై ఇన్చార్జిగా ఉంటారన్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలోని రేపల్లె, చీరాల, బాపట్ల సబ్ డివిజన్ ల పరిధిలలో మూడు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు "శక్తి యాప్" వినియోగించుకొని శక్తి బృందాల ద్వారా మరింత భద్రత పొందవచ్చునన్నారు. మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే వివిధ పిర్యాదులు, ఇబ్బందుల పై పోలీసు వారి సహాయం కొరకు శక్తి యాప్ వినియోగించుకోవాలన్నారు. దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు వేగవంతంగా సమాచారం చేరడంతో పోలీసు సిబ్బంది తక్షణం స్పందించి శర వేగవంతంగా సంఘటన స్థలానికి చేరుకొని కావలసిన సహాయం, సహకారం అందిస్తారన్నారు. కావున జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు, బాలికలు, ఉద్యోగినులు, గృహిణులు తమ యొక్క ఫోన్ లలో శక్తి యాప్ ను నిక్షిప్తం(డౌన్లోడ్) చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన లోకేష్ దంపతులు

విశాలాంధ్ర-మంగళగిరి : యుగ యుగాల దేవుడు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రభుత్వం తరఫున నారా లోకేష్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోఛ్చారణలు, మంగళవాయి ద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. మంత్రి నారా లోకేష్ దంపతుల రాకను పురస్కరించు కుని ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 15వ తేది నుంచి ఏప్రిల్ 24వ తేది వరకు ఒంటిపూట బడులు నిర్వహిం చాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిం చాలన్నారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశా లలు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు పెట్టాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరగడంతో బానుడు భగభగలాడిస్తున్నటంతో రాష్ట్రంలోని పాఠశాలలన్నిటికీ ఈ నెల 15వ తేదీ శనివారం నుండి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ ఒంటి పూట బడులు ఏప్రిల్ 23వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉదయము 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. పదవ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలో మాత్రం ఆ పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు ఉంటాయి. విద్యార్థిని విద్యార్థులు ఈ మార్పును గమనించాలి.

పిఠాపురం తరలిన జనసైనికులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో జరిగిన ఆ పార్టీ ఆవిర్భావసభకు మండలం నుంచి జనసైనికులు 10 వాహనాల్లో తరలి వెళ్లారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూపతి మురళీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. జనసేన నాయకులు సాయివిష్ణు విల్లాన్ అధినేత కంది రవిశంకర్ కూడా జనసేన ఆవిర్భావ వేడుకలకు తరలివెళ్లారు. తమ అధినేత ఆదేశానుసారం మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. తరలివెళ్లిన వారిలో తాడి ధనమూర్తి, తోట అంజి, నందికొండ వెంకటేశ్వర్లు, మునిరి సుబ్బారావు, వెంకంశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని శ్రీ కుసుమ హరనాధ కళ్యాణ మండపంలో విట్టా రవికుమార్ కుమార్తె లక్ష్మి సాహితీ మరియు వెంకట శ్రావణ్ కుమార్‌లకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశాలు

మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరికీ పార్టీ బలోపేతానికై కొండెపి నియోజవర్గ విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతాయని మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ శుక్రవారం వెల్లడించారు. ఐటీసీ ఎదురు దామచర్ల సత్య ఆఫీస్ నందు శనివారం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొంటారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా హోలీ

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో పరిసర ప్రాంతాలలో హోలి పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెనాలి బుర్రిపాలెంలోని సుగాలి కాలనీలో పెద్దలు, యువతీ యువకులు, బాలబాలికలు ఆనందంగా గంతులు వేస్తూ హోలి రంగులు చల్లుకున్నారు. ఆహ్లాదకరంగా ఉత్సాహంతో గెంతులు వేశారు. ప్రధాన కూడళ్లలో జానపద నృత్యాలు ప్రదర్శించారు. చెంచుపేట, చినరావూరు, సుగాలీ కాలనీలలో ఉదయం నుండి సాయంత్రం వరకు హోలి పండుగ ఉత్సవాలు నిర్వహించుకున్నారు.

పుచ్చకాయ ఆరోగ్యానికి మేలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : శరీరానికి కావలసినన్ని విటమిన్లు అందించడంతోపాటు పుచ్చకాయ అత్యంత సులువుగా జీర్ణమవుతుంది. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల దాకా పుచ్చకాయలను ప్రతి ఒక్కరూ ఇష్టంగా తింటారు. దీనిలో మూడింట ఒక వంతు క్యాలరీలు మాత్రమే ఉండడం వల్ల శరీరం బరువు పెరిగే అవకాశం లేదు. ఒక విధంగా పోషకాల గని ఇది. పుచ్చకాయలో 92 శాతం నీరు ఉండడం వల్ల వేసవిలో ఇది శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. దాహార్తి నుంచి రక్షిస్తుంది. 21శాతం సి విటమిన్"18 శాతం ఏ విటమిన్,05 శాతం తో పొటాషియం పాటు 1 బి-5, బి-6 విటమిన్లు 3 శాతం దాకా ఉంటాయి. దీనిలో కాల్షియం నిల్వలు కూడా ఎక్కువే, పుచ్చకాయలో వ్యాధి నిరోధక శక్తి, గుండె ఆరోగ్యాన్ని, కంటి చర్మం ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. కేరేటి సాయిడ్లు ఉంటాయి. శ్వాసకోశ నాళాలను ఆరోగ్యంగా ఉండడంతో పాటు క్యాన్సర్ పనిచేసే బీటో కెరటంలో కూడా అవసరమైన మోతాదులో ఉంటాయి. దీనిలోనే లైకోసిన్ చెడు కొలెస్ట్రాలను తగ్గించడం ద్వారా రక్తపోటును అదుపులో ఉస్తోంది. రక్తనాళాలు గట్టిపడి బిగుసుకుపో కుండా కాపాడుతుంది. మెదడును శక్తివంతంగా మార్చడం ద్వారా మతిమరుపును కలిగించే అల్జీమర్ వ్యాధిని నిరోధిస్తుంది. ఇందులోని సిట్రలిన్ లైంగిక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే కంటి సమస్యలను కూడా నివారి స్తుంది. దీనిలోని సకూర్ బిటా సిన్- శరీరంలో వాపులు రాకుండా నివారిస్తుంది. వాటర్ మిలన్‌లోని సిట్రు లిన్ శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ నిల్వలను పెంచు తుంది. ఇది రక్తనాళాలను విశాలం చేయడం ద్వారా రక్తపోటును తగ్గిస్తుంది. ఇందులోని మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడ పడతాయి. దీనిలో సమృద్ధిగా లభించే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో తిరుగాడే హాని కారక ఫ్రీ ర్యాడి కేల్సను అచివేయడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. విటమిన్ ఏ సరిపడా ఉండడం వల్ల ఇది చర్మ కేశ సంరక్షణలో తోడ్పడుతుంది. ఎండాకాలం చట్టుకు కావాల్సిన తేమను అందిస్తుంది. పీచు పదార్థం ఎక్కువగా గా ఉండడం వల్ల ఇది జీర్ణశక్తిని పెంచుతుంది మలబద్ధకం నుంచి ఉపశమనం.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండల కేంద్రమైన పామూరులోని నాలుగు మసీదుల పరిధిలో ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి స్థానిక విరువూరు రోడ్డులో ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్ చాంద్‌బాషా, నాల్గో ఎంపీటీసీ సభ్యుడు షేక్.అబ్దుల్ ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశాడు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం ముస్లింసోదరులతో కలిసి దువా (ప్రార్థన) నిర్వహించి ఇఫ్తార్ విందు ఆరగించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్ రెడ్డి, ఉపసర్పంచ్ యాదాల వెంకటసాయి కిరణ్,సుబ్బయ్య, గుంట కల్ తిరుపతిరెడ్డి, కల్లూరి రామిరెడ్డి, షేక్ అబ్దుల్, షేక్ గయాజ్, గట్ల విజయ భాస్కర్ రెడ్డి, షేక్ కాలేశా, ప్రేమ్ కుమార్, శ్రీరామ్ శీను, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేకు తీవ్ర అవమానం

తాను ఆవిష్కరించిన శిలాఫలకంపై పేరు లేకపోవడంతో ఖంగుతిన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర -ఒంగోలు: అంబేద్కర్ కాంస్య విగ్రహవిష్కరణ కార్యక్రమంలో దళిత ఎమ్మెల్యేకి తీవ్ర అవమానం జరిగింది. తాను ఆవిష్కరించిన శిలాఫలకంపై తన పేరు లేకపోవడంతో ఖంగుతిన్నారు. సభా వేదికపైకి పిలుస్తున్న అవమానభారంతో ఆ ఎమ్మెల్యే అక్కడనుండి వెళ్ళిపోయారు. ఇదంతా జిల్లా కేంద్రమైన ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి పోతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తోపాటుగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బివిన్ విజయ్‌కుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి స్వామి ఆవిష్కరించగా, శిలాఫలకాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. బిఎన్ విజయకుమార్ శిలాఫలకంపై తన పేరు లేకపోవడంతో ఖంగుతిన్నారు. వేదిక పైకి అతిథులను పిలుస్తున్న అవమాన భారంతో ఎమ్మెల్యే సభాస్థలి నుండి వెళ్లిపోయారు. శిలాఫలకంపై పేర్లు ఏర్పాటు చేయడంలో వివాదం నెలకొంది. అయితే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరుపైన ఒంగోలు పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి పేరు ఉండటంతో మరిన్ని విమర్శలకు శిలాఫలకం తావు నిచ్చింది. నిర్వాహకులతో వాగ్వివాదానికి దిగారు. తమ ఎమ్మెల్యేపై ఉద్దేశపూర్వకంగానే కుట్ర చేశారని ఆరోపణలు చేశారు. ఏదేమైనా దళిత ఎమ్మెల్యేకు జరిగిన అవమానం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-తాడికొండ : నిడుముక్కల గ్రామంలోని దర్గా ఎదురుగా పంట పొలాల్లో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. గ్రామంలో బియ్యం నిల్వల విషయం అధికారుల దృష్టికి చేరింది. ఈ నేపథ్యంలో అధికారులు దాడులు నిర్వహించి 8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని 12వ షాప్‌కు అప్పగించినట్లు తెలిసింది. అధికారులకు నెలసరి మామూలు అందకపోవడంతో దాడులు నిత్య కృత్యంగా మారాయని గ్రామస్తులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వివరణ కోరేందుకు ప్రయత్నించగా సివిల్ సప్లై డి.టి. దేవరాజు అందుబాటులోకి రాలేదు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-తాడికొండ : మండల కేంద్రమైన తాడికొండ శ్రీ గిరీశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతోందని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి జీ.వి. నారాయణ శుక్రవారం తెలిపారు. నేడు నిత్య పూజా విధులు, వాస్తు పూజ, శ్రీ గణపతి హోమము, ప్రసాద వినియోగం, విగ్రహాలను, ధ్వజ స్తంభమున నీటితో శుభ్రం చేయుట మొదలగు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు గమనించాలన్నారు.

కాలువలో పడి విద్యార్థి మృతి

విశాలాంధ్ర-పెదకాకాని : కాలువలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నంబూరు గ్రామం లో జరిగింది. అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి జాషువా(12) శుక్రవారం సెలవు దినం కావడంతో తన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ పక్కనే ఉన్న గుంటూరు ఛానల్‌కి వెళ్ళాడు. సరదాగా నీటిలోకి దిగడంతో కాలుజారి కాలువలోకి పడిపోయాడు. తనతో ఆడుకునే చిన్నారులు స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికి బాలుడు తుదిశ్వాస విడిచాడు. బాలుడు మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర విషాదం వ్యక్తం చేశారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : రాష్ట్రంలో పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని విజనరీ లీడర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.శుక్రవారం ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు గాడిలో పెట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.అపార అనుభవం విజన్ కలిగిన చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.అభివృద్ధి సంక్షేమ దిశగా పనిచేశానన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు యజ్ఞం చేస్తున్నారన్నారు.అహర్నిశలు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నారని వివరించారు.చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు పని చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు.సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఒక రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తానన్నారు.

- జనసేనానికి శుభాకాంక్షలు : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధినేత,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,నేతలు,కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.ఏపీ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి జనసేన చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో జనసేన కీలకం పాత్ర పోషించిందన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్,ఆంధ్రప్రదేశ్ అమరావతి వారి ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు సంబంధించిన ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 15వ తేది నుంచి విద్యా సంవత్సరం ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు.పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా కేటాయించిన పాఠశాలలు మాత్రం పరీక్షలు పూర్తయ్యే వరకు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5గంటల వరకు బడులు నిర్వహించాలని తెలిపారు.

నవోదయం 2.0పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - నిజాంపట్నం : సారా రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే నవోదయం 2.0 కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు అన్నారు.రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దిండి పంచాయతీ యేమినేనివారిపాలెం గ్రామంలో అవగాహన సదస్సు,ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రంగా,అశాస్త్రీయ పద్ధతిలో నాటుసారా తయారు చేయడం వల్ల ఎక్కువ మోతాదులో విషపూరిత రసాయనాలు ఉండటంతో నాటు సారా త్రాగే వారి ఆరోగ్యం క్రమంగా క్షీణించి వారితో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతింటాయని చెప్పారు.నాటు సారా అమ్మడం, తయారు చేయడం రవాణా చేయడం,కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. 8 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు రూ.5 లక్షలు విధించడం జరుగుతుందన్నారు.నాటు సారా తయారీ,రవాణా, అమ్మకం,ముడి పదార్థాల అమ్మకాల గురించి ఎవరికైనా సమాచారం ఉంటే స్టేషన్ హౌస్ ఆఫీసర్ సెల్ : 9490455599, 9440902477 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14405లకు సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.అనంతరం సారా రహిత గ్రామాలుగా మార్చుకుందామని గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సైలు ఎస్.రామారావు,పి.రాజేంద్రప్రసాద్,నగరం ఎక్సైజ్ సీఐ మార్టూరి శ్రీరామ ప్రసాద్,సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కళ్యాణం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక గడియార స్తంభం కూడలి వద్ద నున్న శ్రీదేవల్లి కనకవల్లి సమేత శ్రీవీరరాఘవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అశేష భక్తుల మధ్య శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు దిట్టకవి వాసుదేవ సంపత్ కుమార్ ఆచార్యులు నిర్వహించారు. సుమంగళ వాయిద్యాల మధ్య,వేద మంత్రాలతో నిర్వహించిన శాంతి కళ్యాణం చూడటం కోసం అధిక సంఖ్యలో మహిళలు,భక్తులు హాజరయ్యారు.ఆలయ కార్యనిర్వహణాధికారి వీసీ కృపారావు దంపతులు కల్యాణ మహోత్సవంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రాధా మాధవి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రాధామాధవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని అక్బర్‌పేటలో గల బాల సదనంలో బాపట్ల జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయానికి చేరుకుని సిబ్బంది నుంచి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ పార్టీ బలోపేతానికి విస్తృతస్థాయి సమావేశాలు

విశాలాంధ్ర - జరుగుమల్లి : జరుగుమల్లి మండల టీడీపీ కుటుంబ సభ్యులందరికీ పార్టీ బలోపేతానికై కొండెపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాలు ఐటీసీల ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కార్యాలయం నందు జరుగుతాయని టీడీపీ మండల అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు శుక్రవారం సమావేశంలో తెలిపారు. శనివారం సాయంత్రం మూడు గంటల సమయంలో జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ,రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్, దామచర్ల సత్య ముఖ్య అతిథులుగా విచ్చేయనున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్, పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

దళిత నేత కొండ్రు కిరణ్

విశాలాంధ్ర - చీరాల : ప్రభుత్వ భూములు ఆక్రమణల పేరిట సోషల్ మీడియా తనపై సత్యదూరమైన ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేస్తానని దళిత నేత కొండ్రు కిరణ్ అన్నారు.శుక్రవారం తనపై వస్తున్న దుష్ప్రచారాల నేపథ్యంలో చీరాల మండల తహసీల్దార్ గోపికృష్ణను కలిసి చీరాల మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీ,సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోని ప్రభుత్వం భూముల్లో పారదర్శకంగా సర్వే చేయించి అన్యాక్రాంతం కబడుతున్న భూములను సంరక్షించాలని వినతి పత్రాన్ని అందజేశారు.ఈసందర్భంగా మీడియాతో కొండ్రు కిరణ్ మాట్లాడుతూ చీరాల పట్టణ పరిధిలోని రోశయ్య కాలనిలో స్థానికంగా తనకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి తనకు సర్వహక్కులు కలిగిన భూముల్లో సైతం సర్వే చేయించాలని,తాను ఏ మాత్రం ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఉంటే ఆయా భూములను బేషరతుగా స్వాధీనం చేసుకోవచ్చునన్నారు. ప్రభుత్వ అధికారులు అన్యాక్రాంతమౌతున్న ప్రభుత్వ భూమిని సర్వే నిర్వహించి స్వాధీనం చేసుకోవాలన్నారు.రోశయ్య కాలనీ,సెయింట్ ఆన్స్ పాఠశాల చుట్టూ పక్కల ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఉన్న ప్రభుత్వ భూములు ఇప్పటికే ఆక్రమణల చెరలో ఉన్నాయని ఆయా భూములలో అధికారులు పారదర్శకంగా సర్వే చేసి ప్రభుత్వ భూములను సంరక్షించాలని కోరారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న చీరాల పట్టణంలో స్థానికంగా అనేకమంది నిరుపేదలు అర్హత ఉండి నివేసిన స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని,వారందరికీ ఆయా ప్రభుత్వ భూములను కేటాయించి న్యాయం చేయాలన్నారు.తనపై వస్తున్న ఆరోపణల క్రమంలో తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశామని,ఇదే క్రమంలో అన్యాక్రాంతమౌతున్న ప్రభుత్వం భూముల అంశంపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర - వేమూరు : విద్యార్థుల అభ్యున్న తికి గ్రేస్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఫౌండేషన్ సభ్యులు పచ్చిగళ్ళ అనిల్ పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గ్రేస్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కైతేపల్లి షాలేమ్‌రాజు సహకారంతో పరీక్షా మెటీరియల్స్ అందజేశారు.ఈ సందర్భంగా గ్రేస్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారాన్ని అభి నందించారు.పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్యాడ్స్, పెన్సులు,జామెంట్రీ బాక్స్ వంటి వస్తువులను వారికి అందించారు.గ్రేస్ ఫౌండేషన్ అందిస్తున్న ప్రోత్సా హకాన్ని అందుకొని మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు తెలియ జేశారు. ఆరుమళ్ళ దేవా, రాయల్ వినయ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పరిశ్రమలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అంది పుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో యువ పారిశ్రామిక వేత్తలకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎం ఎస్ ఎం ఈల ద్వారా వివిధ రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుందని అన్నారు. నూతన ఆవిష్కరణలతో, ఆలోచనలతో పరిశ్రమలు స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఎదిగే క్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డా ఎస్ గ్రేస్, అధికారులు రామకృష్ణ, చిట్టిబాబు, లక్ష్మణాచారి, మధుసూదనరావు, అంజిబాబు, వాణి, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.